సాక్షి
కుమురం భీం

బుధవారం : 22 : నవంబర్ : 2023



పట్టుకున్నదంతా ప్రజలదే!

చెక్‌పోస్టుల వద్ద భారీగా నగదు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు సాధారణ ప్రజలదే కావడం గమనార్హం. 10లో▸



'కంది'పోతున్న ఆశలు..!

కంది పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 46వేల ఎకరాల్లో కంది సాగు ఉంది. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1 /16.7

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. చాలావరకు ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు సిద్ధంగా ఉండాలి



జిల్లా కేంద్రంలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: ఎన్నికల అనంతరం డిసెంబర్ 3న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహిపాల్, పోలీస్ పరిశీలకులు డీకే చౌదరి, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్, కౌంటింగ్ హాల్స్ కౌంటర్లు, ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తూ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో అధికారులు, అభ్యర్థులకు వేర్వేరు ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, కలెక్టరేట్ ఏవో రఫతుల్ల, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మహాపాదయాత్ర



22వ టోంకిని శ్రీసిద్ధి హనుమాన్ మహాపాదయాత్ర మంగళవారం వైభవంగా సాగింది. భక్తులు భారీగా తరలిరావడంతో కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మండలం టోంకిని వరకు రహదారి జనసంద్రంగా మారింది. దాదాపు 30వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ ట్రస్టు సభ్యులు వెల్లడించారు.

- వివరాలు లోపలి పేజీల్లో..

ఐటీ అలజడి..!

- రాజకీయ నేతల్లో కలవరం
- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో సోదాలు
- పత్తి వ్యాపారుల ఇళ్లు, జిన్నింగ్ మిల్లుల్లో తనిఖీలు
- తెల్లవారుజామున మూడు గంటల నుంచి రాత్రి వరకు..
- జిల్లాకు మొదటిసారి ఇన్‌కం ట్యాక్స్ అధికారుల రాక



జిల్లా కేంద్రంలోని రఫీక్ నివాసం వద్ద పోలీసులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో ఆదాయపు పన్ను అధికారులు నిర్వహించిన సోదాలు అలజడి సృష్టించాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌కు చెందిన పలువురు పత్తి వ్యాపారుల ఇళ్లు, జిన్నింగ్ మిల్లుల్లో ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు మొదలైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగాయి. కాగా, పత్తి వ్యాపారులు ముగ్గురు అధికార బీఆర్ఎస్ పార్టీకి సన్నిహితులు కావడం.. ఉదయం 7 గంటలకు ఈ విషయం జిల్లాలో దావానంలా వ్యాపించడంతో పార్టీ వర్గాల్లో కలకలానికి దారితీసింది. ఈ తనిఖీలతో ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నేతలు కలవరానికి గురైనట్లు తెలుస్తోంది.

ఏకకాలంలో తనిఖీలు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో ఐటీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. నాలుగు బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పత్తి వ్యాపారి రఫీక్ ఇంటికి ఐటీ అధికారులు తెల్లవారుజామున 3 గంటలకు చేరుకున్నారు. బాపూనగర్‌లో ఉన్న వారి పాత ఇంటితోపాటు ప్రస్తుతం ఉన్న ఇల్లు, జిన్నింగ్ మిల్లులో సోదాలు చేశారు. అదేవిధంగా కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన పత్తి వ్యాపారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, పట్టణంలోని వార్డు నం.2 లోయ మార్గ్‌లో నివసిస్తున్న కాటన్ మిల్లు వ్యాపారి చిలువేరు గంగన్న ఇళ్లతోపాటు రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డులో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లోనూ ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారి బ్యాంకు వివరాలు, ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు సమాచారం. ఆయా సంస్థలకు చెందిన ఆదాయపు పన్ను చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. తనిఖీల నేపథ్యంలో ఐటీ అధికారులు రఫీక్, శ్రీనివాస్, గంగన్న కుటుంబ సభ్యుల ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నాయకుల్లో కలవరం..

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌కు చెందిన పత్తి వ్యాపారులు ముగ్గురు అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావడం గమనార్హం. కాగజ్‌నగర్‌కు చెందిన కాసం శ్రీనివాస్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్‌కు చెందిన రఫీక్ ఇటీవలే అధికారికంగా పార్టీ కండువా కప్పుకున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ స్వయంగా రఫీక్‌కు పార్టీ కండువా కప్పడం విశేషం. ఈ నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో వీరి ఇళ్లపై ఐటీ దాడులు జరగడంతో అధికార పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయని పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. వీరికి అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులతో అత్యంత సన్నిహిత, ఆర్థిక, వ్యక్తిగత సంబంధాలున్నాయి. ఎన్నికల సమయంలో వారికి అవసరమైతే ఆర్థిక వనరులను స్వీకరించడంలో, గుట్టుచప్పుడు కాకుండా అవసరమైన చోటుకు తరలించడంలో కీలక పాత్ర పోషిస్తారని రాజకీయ వర్గాల్లో ప్రచారం ఉంది. అలాంటి బడా వ్యాపారులకు సంబంధించిన ఇళ్లు, జిన్నింగ్ మిల్లులపై ఐటీ దాడులు.. జిల్లాకు చెందిన పలువురి నాయకుల్లో తీవ్ర కలవరపాటు కలిగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సదరు నేతలు ఈ నెల 30న జరిగే ఎన్నికల కోసం కొంత నగదు వీరి వద్ద ఉంచారని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఆ విషయాలు ఐటీ దాడుల్లో ఎక్కడ బయటపడుతాయోనని ఆయా నేతలు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

రఫీక్ ఇంట్లో రూ.8.5కోట్లకు పైగా నగదు?

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోదాలు నిర్వహించిన ఐటీ అధికారులు మధ్యాహ్నం కాసం శ్రీనివాస్‌ను కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌బీఐకి తీసుకెళ్లి విచారించారు. అదే సమయంలో ఆసిఫాబాద్ పట్టణంలోని వ్యాపారవేత్త రఫీక్ ఇంటికి ఎస్‌బీఐ నుంచి కౌంటింగ్ మిషన్‌ను ఐటీ అధికారులు తీసుకువచ్చారు. మిషన్‌తోపాటు సిబ్బంది వందలాది రబ్బర్ బ్యాండ్‌లను ఇంట్లోకి తీసుకెళ్లడంతో పెద్దమొత్తంలో నగదు బయటపడినట్టు తెలుస్తోంది. రఫీక్ ఇంట్లో రూ.8.5కోట్లకు పైగా డబ్బు దొరికినట్లు సమాచారం. ఈ డబ్బును బ్యాంకు నుంచి డ్రా చేసినట్లు తెలుస్తోంది.



అధికారులు గేటు మూయడంతో కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద జిన్నింగ్ మిల్లు ఎదుట నిలిచిన వాహనాలు

సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ పూర్తి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల పరిశీలకులు రాహుల్ మహిపాల్, డీకే చౌదరి, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో పోలింగ్‌కు సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 43 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 39 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. వీరు పోలింగ్ తీరును నివేదిస్తారని పేర్కొన్నారు.

ఓటింగ్ యంత్రాల రెండో విడత ర్యాండమైజేషన్..

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహిపాల్, రిటర్నింగ్ అధికారి దాసరి వేణులో కలిసి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 305 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల రెండో విడత కేటాయింపు పూర్తయిందని వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు

ఆసిఫాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ.. పోలింగ్ రోజు అత్యవసర సేవల కింద విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఓటుహక్కు ముందస్తుగా వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు తప్పనిసరిగా ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకునే ఓటర్ల జాబితా వివరాలు అందించాలన్నారు. ఇంటి వద్ద నుంచి ఓటు సేకరణ వివరాలను ప్రతిరోజూ మీడియా ద్వారా వెల్లడించాలన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని, ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించి, వయోవృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణు తదితరులు పాల్గొన్నారు.

టోల్ బాదుడుకు రెడీ

- వాంకిడి సమీపంలో నేటి నుంచి టోల్‌ప్లాజా ప్రారంభం
- జాతీయ రహదారి పనులు పూర్తి కాకుండానే వసూళ్లు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



వాంకిడి సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా

టోల్ చార్జీల వివరాలు (రూ.లలో)

వాహనాల కేటగిరీ	సింగిల్ జర్నీ	తిరుగు ప్రయాణం	నెల పాస్ (50 సింగిల్ ప్రయాణాలు)	జిల్లా పరిధి రిజిస్టర్ వాణిజ్య వాహనాలు
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనం	75	110	2,475	35
లైట్ కమర్షియల్, లైట్‌గూడ్స్, మినీబస్	120	180	3,995	60
బస్సు, ట్రక్	250	375	8,370	125
త్రీయాక్సిల్స్	275	410	9,130	135
4–6 యాక్సిల్స్	395	590	13,125	195
అధిక బరువు వాహనాలు	480	720	15,980	240

వాంకిడి(ఆసిఫాబాద్): మహారాష్ట్ర సరిహద్దులో వాంకిడి మండలం గోయేగాం నుంచి మంచిర్యాల జిల్లా రేపల్లెవాడ వరకు 52 కిలోమీటర్ల వరకు నూతనంగా నిర్మించిన నాలుగు వరుసల జాతీయ రహదారి– 363 టోల్ పరిధిలోకి వెళ్లనుంది. ఇదే రహదారిపై మంచిర్యాల జిల్లా మందమర్రి సమీపంలో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద ఇప్పటికే టోల్ వసూళ్లు కొనసాగుతున్నాయి. వాంకిడి మండల కేంద్రానికి సమీపంలో ఎన్‌హెచ్– 363పై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలో బుధవారం నుంచి టోల్ వసూళ్లు ప్రారంభం కానున్నాయి. అయితే 2019లో ప్రారంభమైన హైవే పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పనులు పూర్తి కాకుండానే అధికారులు టోల్ వసూళ్లకు సిద్ధం కావడంపై వాహనదారులు అభ్యంతరం తెలుపుతున్నారు. నిర్మాణ పనులు పూర్తికాక ఇప్పటికే ఇబ్బంది పడుతున్నామని, తమపై అదనపు భారం మోపడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా హైవే పనులు..

మంచిర్యాల జిల్లాలోని రేపల్లెవాడ నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన గోయేగాం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నాలుగేళ్లుగా పనులు సాగుతున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో వన్యమృగాలు రోడ్డు దాటేందుకు వీలుగా నిర్మిస్తున్న ఏకో వంతెన పనులు ఇంకా కొనసాగుతున్నాయి. అలాగే వాంకిడి మండల కేంద్రం గుండా నిర్మిస్తున్న రహదారి పనులు, రెబ్బెన మండలం తక్కలపల్లి సమీపంలో వన్యప్రాణుల రాకపోకలకు అనుకూలంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

రాకపోకలకు అవస్థలు..

జాతీయ రహదారిపై నిత్యం భారీ నుంచి అతిభారీ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్లుగా పనులు కొనసాగుతుండటంతో పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో ట్రాఫిక్‌తో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు పూర్తికాకుండానే వసూళ్లు ప్రారంభించడమేంటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి వసూళ్లు

వాంకిడి మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారి– 363పై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద నేటి నుంచి టోల్ వసూళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు వాహనాల కేటగిరీ ప్రకారం రుసుం నిర్ణయించారు.

అసంపూర్తి పనులతో ఇబ్బంది



నాలుగు వరుసల రహదారి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో అవస్థలు పడాల్సి వస్తోంది. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. మండల కేంద్రంలో భారీ వాహనాలు నిలిచిపోతున్నాయి. పనులు పూర్తి చేసి టోల్‌ప్లాజా ప్రారంభించాలి.

- జాడి లోకేశ్, వాహనదారుడు

ఇప్పుడే వసూళ్లు సరికాదు



రహదారి పనులు పూర్తి చేయకుండానే టోల్ వసూళ్లు ఇప్పుడే ప్రారంభించడం సరికాదు. వాంకిడి మండలం నుంచి మంచిర్యాల వరకు రెండు టోల్ ప్లాజాల్లో ట్యాక్స్ భరించాల్సి వస్తుంది. వాహనదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

- దొంగ్రె రమేశ్, వాహనదారుడు

వేతనాలు అందవు.. బాధలు తీరవు

- దయనీయంగా కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల జీవితాలు
- అందని ద్రాక్షగా నాణ్యమైన వైద్యసేవలు
- ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులు

ప్రజా ఎజెండా

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 125 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు జీవితాలు దయనీయంగా మారాయి. రెగ్యులర్ చేయకపోవడం, నెలనెలా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ చేయాలని, తద్వారా వైద్యసేవలు అందే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నా వైద్యసేవలు అందని ద్రాక్షగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపొందే నాయకుడైనా జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ కాగజ్‌నగర్ పట్టణం స్వచ్ఛతకు కృషి చేస్తున్న తమ కష్టాన్ని గుర్తించి, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వేతనాల కోసం ఆందోళనలు



కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 125 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వేతనాల కోసం తరచూ ఆందోళనలు, నిరసనలు చేపట్టాల్సి వస్తోంది. అయినా ప్రతినెలా జీతాలు చెల్లించడంలో అధికారులు విఫలమవుతున్నారు. తమ న్యాయమైన హక్కులు కాపాడేందుకు అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- తిరుపతి

ఉద్యోగ భద్రత కరువు



బల్దియా పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి. కార్మికులను క్రమబద్ధీకరించకపోవడంతో ఉద్యోగ భద్రత కరువైంది. అధికారుల తీరుతో వేతనాలు కూడా సక్రమంగా అందడం లేదు.

- భాస్కర్

సామగ్రి అందజేయాలి



కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు నిర్ధారించిన సమయంలో బూట్లు, సబ్బులు, నూనె, బట్టలు వంటి సామగ్రి అందించారు. సకాలంలో కార్మికుల చేతికి చేరడం లేదు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే తమకు రక్షణ పరికరాలు లేకపోతే వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది.

- లక్ష్మణ్

వైద్యసేవలు అందడం లేదు



ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఆయా సంస్థల ఖాతాల్లో అధికారులు జమ చేయాలి. ఈఎస్ఐ, పీఎఫ్‌కు సంబంధించిన రూ.కోటిన్నర డబ్బు ఆయా సంస్థల ఖాతాలో చెల్లించకపోవడంతో కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యసేవలు అందడం లేదు. అధికారులు జాప్యం చేయకుండా ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలి. ఏళ్లుగా ఆందోళనలు, నిరసనలు తెలియజేస్తున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

- శంకర్

వేతనాలు అందక..



మున్సిపాలిటీ పరిధిలోని ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు అమలు చేయాలి. నెలకు రూ.25 వేల జీతం అందించాలి. ప్రతినెలా మొదటి వారంలో కార్మికులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- కుమార్

ప్రతినెలా చెల్లించాలి



బల్దియా పరిధిలో కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించకపోవడంతో కనీసం పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. నాలుగైదు నెలలకు ఒకసారి జీతాలు అందుతున్నాయి. ఇదే పనిపై ఆధారపడిన తాము కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి..? వేతనాల విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలి.

- గోపాల్

క్లుప్తంగా

రూ.లక్ష నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో పోలీసులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆర్ఎస్సై గోపీకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన షబ్బీర్ ఖురేషి అనే వ్యక్తి తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తి సిరోంచకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మదర్ థెరీసా పాఠశాలపై విచారణ



విచారణలో పాల్గొన్న అధికారులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కన్నెపల్లిలో ఉన్న మదర్ థెరీసా పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డీఈవో విచారణకు ఆదేశించారు. ఎంఈవో రవీందర్, జిల్లా సెక్టోరియల్ అధికారులు సత్యమూర్తి, చౌదరి మంగళవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విచారణ చేపట్టారు. అకారణంగా విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని, తల్లిదండ్రుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈమధ్య పాఠశాలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక ముందు రాకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ మళ్లీ వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి స్వాధీనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. హాజీపూర్‌కు చెందిన ముచ్చకుర్తి మారుతి జాఫర్‌నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 105 గ్రాముల గంజాయి లభించినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లు

బెల్లంపల్లి: పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మంగళవారం కాంటా చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కన్నెపల్లి మండలం సాలిగామకు చెందిన పూదరి రమేశ్‌ను తనిఖీ చేయగా రూ.6,300 విలువచేసే మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పట్టుకున్నదంతా ప్రజలదే!

- పార్టీల సొమ్ము రూపాయి కూడా సీజ్ చేయని అధికారులు
- ఎన్నికల్లో అక్రమాలు అడ్డుకునేందుకు ఐదంచెల నిఘా
- మనీ, మద్యం, తదితర పంపిణీపై ప్రత్యేక దృష్టి
- సామాన్యుల సొమ్ము పట్టుకున్నారు.. ఆధారాలు చూసి ఇచ్చేశారు



జిల్లా కేంద్రంలో నగదు సీజ్ చేస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 30న జరగనున్న నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు విజయం సాధించేందుకు చేయని ప్రయత్నమంటూ ఉండదు. ఓటర్లను వివిధ రకాల ప్రలోభాలకు గురిచేస్తూ మద్యం, మనీ, వివిధ రకాల బహుమతులు ఎరగావేసి తమ వైపు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. కానీ ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా ఎన్నికల నిబంధనల ప్రకారం నేరమే. అయితే వీటిని కట్టడి చేసేందుకు భారత ఎన్నికల కమిషన్ ఐదంచెల నిఘా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు 24/7గంటలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. గత నెల 9న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి పోలీస్, ఎక్సైజ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కొరడా ఝులిపిస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో, ప్రధాన రహదారులపై 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 20 వరకు జిల్లాలోని వివిధ ఏరియాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.1,71,66,835 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. బాధితులు నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించడంతో 24 గంటల్లో తిరిగి అప్పగించడం గమనార్హం. కాగా ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు అమాయకులదే కావడం గమనార్హం. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 42 రోజులు అవుతోంది. ఓటింగ్‌కు ఇక 8 రోజుల గడువు మాత్రమే ఉంది. కానీ ఇప్పటి వరకూ రాజకీయ నాయకులకు చెందిన ఒక్క రూపాయి నగదు కూడా లభించకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మద్యంపై నిఘా

ఓటర్లను ప్రభావితం చేసే మద్యాన్ని కట్టడి చేసేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు విచ్చలవిడిగా కొనసాగిన బెల్ట్‌షాపులపై కొరడా ఝులిపిస్తున్నారు. వైన్‌షాపుల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.2కోట్ల 16 లక్షల 12వేల విలువైన మద్యం (50,275,82 లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న 327 బెల్ట్‌షాపులను మూసివేశారు. 886 కేసులు నమోదు చేసి 650 మందిని అరెస్టు చేశారు.

ఇతర వస్తువులు..

ఓటర్లను ప్రభావితం చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు బహుమతుల రూపంలో చీరలు, బంగారం, పార్టీలకు చెందిన టీషర్టులు, టోపీలు, పార్టీ కండువాలు సైతం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి రూ.లక్ష విలువ గల బంగారం, 760 చీరలు, 205 షర్ట్స్, 700 పార్టీ కండువాలు, 900 టోపీలు స్వాధీనం చేసుకున్నారు. కాగా బంగారంకు సంబంధించిన బాధితులు సరైన పత్రాలు సమర్పించడంతో తిరిగి వారికి అప్పగించారు. చీరలు, కండువాలు, టోపీలకు సంబంధించిన వాటికి ఎవరూ రాకపోవడంతో అవి పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం.

సీ–విజిల్ యాప్...

ఎన్నికల్లో అక్రమాలను అరికట్టేందుకు, జరుగుతున్న అక్రమాలపై తక్షణమే ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల కమిషన్ సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. క్షణాల్లో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసే విధంగా యాప్ రూపొందించారు. అక్రమాలు జరిగే తీరును వీడియో, ఫొటోలు తీసి నేరుగా సీ–విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వంద నిమిషాల్లో సమస్య పరిష్కరించబడుతోంది. యాప్ ద్వారా ఇప్పటి వరకు 80 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 43 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయగా 37 కేసులు తిరస్కరించబడ్డాయి.

ఇంతింతై... 40 రెట్లై

- నలభై రెట్లు పెరిగిన అసెంబ్లీ ఎన్నికల వ్యయం
- తొలి ఎన్నికల్లో రూ.లక్ష మాత్రమే గరిష్ట పరిమితి
- ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు
- ప్రతీ రూపాయికి లెక్క పక్కాగా ఉండాల్సిందే
- ఎన్నికల కమిషన్ నిర్దేశిత నియమావళి ఇదే...

నిర్మల్ ఖిల్లా: ప్రస్తుతం ఎన్నికల సమరం కొనసాగుతోంది. మరోవారం రోజుల్లో పోలింగ్ ఉండడంతో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఇష్టారీతిన డబ్బు ఖర్చు చేయడానికి వీలులేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనలు అనుసరించి వ్యయపరిమితి గరిష్టంగా రూ.40 లక్షలు మాత్రమే విధించబడినది. అయితే ఈ వ్యయ పరిమితి గతంలో ఉన్నదానికంటే క్రమంగా 'ఇంతింతై.. 40 రెట్లై'అన్న చందంగా పెరుగుతూ వస్తోంది. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో అప్పటి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల్లో పోటీ చేసిన ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు గరిష్టంగా రూ.లక్షగా నిర్దేశించబడింది. అప్పటి నుంచి ప్రతీసారి పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి గరిష్టంగా రూ.40 లక్షలు ఖర్చు చేయడానికి వ్యయపరిమితి విధించబడింది. అంటే ఎన్నికలు ప్రారంభమైన ఏడు దశాబ్దాల కాలంలో దాదాపు 40 రెట్లు పెరుగుతూ వచ్చింది.

నామినేషన్ వేసిన రోజు నుంచే లెక్క షురూ..

2014 అసెంబ్లీ ఎన్నికలకు రూ.28 లక్షలుగా ఉన్న అభ్యర్థుల వ్యయ పరిమితిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఏకంగా రూ.40 లక్షలకు పెంచింది. లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించింది. నామినేషన్ వేసిన రోజు నుంచి పోలింగ్ జరిగే వరకు అభ్యర్థి చేసే ఖర్చును ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తారు. పార్టీ చేసే ఖర్చు మాత్రం అభ్యర్థి వ్యయంలోకి రాదు. ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులు చేసే ఖర్చులను బ్యాంకు ఖాతా ద్వారానే నిర్వహించాలి. అందుకోసం నామినేషన్ దాఖలు చేసే నాటికే పోటీలో ఉన్న అభ్యర్థులంతా కొత్తగా బ్యాంకు అకౌంట్ ప్రారంభించుకున్నారు..

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లేదా ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదని ఎన్నికల నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల తనిఖీల్లో పట్టుబడిన తాయిలాలను అభ్యర్థుల వ్యయంలో చేర్చాలని ఎన్నికల కమిషన్ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. రోజువారీగా అభ్యర్థులు చేసే వ్యయంతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధన ఖర్చులు, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చులను కలిపి అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతి దానికీ బిల్లులు చూపించాల్సి ఉంటుంది. వీటన్నింటికి ఎన్నికల సంఘం ధరలు నిర్ణయిస్తుంది. వాటి ప్రకారమే లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఇవి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉన్నాయి.

పెరుగుతున్న వ్యయపరిమితి..


1952 సాధారణ ఎన్నికల్లో రూ.లక్షతో ప్రారంభమైన ఎన్నికల వ్యయ పరిమితి 1962 నాటికి రూ.3 లక్షలు 1971 ఎన్నికల నాటికి రూ.4 లక్షలు, 1975 నాటికి రూ.5 లక్షలు పెరుగుతూ వచ్చింది. 1984లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా రూ.10 లక్షలకు చేరువైంది. 1991 నాటికి మరో రెండు లక్షలు పెరిగి రూ.12 లక్షలకు చేరుకుంది. 1999లో రూ.15 లక్షలు, 2004 నాటికి రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల వ్యయపరిమితిని విధించారు. ప్రస్తుతం జరుగుతున్న 2023 ఎన్నికల్లో ఈ గరిష్ట వ్యయపరిమితి రూ.40 లక్షలకు చేరుకుంది.

వ్యయపరిమితి పెరుగుదల ఇలా..

సంవత్సరం	వ్యయపరిమితి (రూ.లక్షల్లో)
1952	1
1962	3
1971	4
1975	5
1984	10
1991	12
1999	15
2004	17
2009	26
2014	28
2023	40

ఓటరూ గుర్తుంచుకో..

- నవంబర్ 30 మర్చిపోకు
- చీటీలపై పోలింగ్ కేంద్రానికి రూట్‌మ్యాప్..
- ఓటు వేసేలా చైతన్యం



పోల్‌చీటీలపై ముద్రించిన మ్యాప్, అంశాలు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి ఈ నెల 30న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు ఓటర్లకు పోల్‌చిట్టీలు పంపిణీ చేస్తున్నారు. 'ఓటు మనందరి బాధ్యత.. హక్కు కూడా.. తప్పనిసరిగా ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి.. ఓటరు చైతన్యంగా ఓటు వేసేలా చిట్టీ వెనకాల వివరాలు రాశారు. ఎన్నికల రోజున నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకునే విధంగా పోల్ చిట్టీల వెనక భాగంలో ప్రత్యేక గూగుల్‌మ్యాప్, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం పేరుతో పలు విషయాలు ముద్రించారు.

ఓటు వేసేందుకు ఇవి తప్పనిసరి..

పోల్‌చిట్టీలో ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒక దానిని వెంట తీసుకెళ్లి ఓటు వేయాలనే అంశాలను పొందుపర్చారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు చీటి, గుర్తింపు కార్డులను చూపించాలి. పోలింగ్ అధికారి ఓటరు జాబితా, గుర్తింపు కార్డులో పేరును పరిశీలిస్తారు. మరో అధికారి వేలికి ఇంకు పెడతారు. తర్వాత ఓచీటి ఇస్తారు. మూడో అధికారి ఆ చీటీని పరిశీలిస్తారు. తర్వాత ఈవీఎంలో మీరు ఎన్నుకోవాల్సిన అభ్యర్థికి చెందిన బటన్ నొక్కాల్సి ఉంటుంది. ఓటు వేసిన తర్వాత స్లిప్ వస్తుంది. పక్కనే వీవీప్యాట్‌లో చూసుకునే వీలుంది. ఓ టు నిర్ధారించుకున్న తర్వాతే అక్కడి నుంచి కదలాలి.

పోల్‌చిట్టీలపై మరిన్ని..

ఓటర్లకు పంపిణీ చేస్తున్న పోల్‌చిట్టీల్లో మరిన్ని అంశాలు పొందుపర్చారు. పోలింగ్ సమయంలో క్యూలో ఉన్న ఓటర్లందర్నీ ఓటు వేయడానికి అనుమతిస్తారు. మహిళలకు ప్రత్యేక క్యూ ఉంటుంది. సీనియర్ పౌరులకు ఓటు వినియోగంలో ప్రాధాన్యత ఇస్తారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు వంటి గాడ్జెట్లకు పోలింగ్ బూత్ లోపలికి అనుమతి లేదు. ఏదైనా ఒక ప్రత్యేక అభ్యర్థికి ఓటు వేసే నిమిత్తం డబ్బును అంగీకరించడం, ఏ ఇతర వస్తువులను స్వీకరించడం చట్టప్రకారం అవినీతికి పాల్పడినట్లు పరిగణించబడుతుందని తెలుగు, ఇంగ్లిష్ భాషలతో ముద్రించిన పోల్ చిట్టీలు పంపిణీ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాల క్రీడామైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 45 మంది క్రీడాకారులు పాల్గొనగా ఎం.వేణు, ఎ.వర్ధన్, ఎం.చరణ్ (సీవోఈ–బెల్లంపల్లి), ఎ.తరుణ్ (టీఎస్ మోడల్ స్కూల్, ఆసిఫాబాద్), జె.మల్లయ్య, ఎం.ప్రణీత్ (గురుకుల కళాశాల, జైపూర్), ఎం.వెంకటరాజు, వర్ధన్ (కాసిపేట బాలుర గురుకుల కళాశాల) ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, కాసిపేట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు, పీఈటీలు అల్లూరి వామన్, నడిగోటి రాకేష్, కుమ్మరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు మృతి

జైపూర్: మండలంలోని టేకుమట్ల క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి తోకల తిరుపతి (40) మృతి చెందాడు. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమనపల్లికి చెందిన తిరుపతి మంచిర్యాలో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్లి వస్తుండగా రోడ్డుపై నిలిపి ఉంచిన పొక్లెయిన్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కుర్చున్న రామిళ్ల మహేందర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురి సంతాపం



తిరుపతి (ఫైల్)

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మంగళవారం తిరుపతి పార్థీవ దేహానికి సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్రకమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శి శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందెమంగ, తదితరులు నివాళులర్పించారు.

ఐటీ దాడులకు నిరసనగా రాస్తారోకో



చెన్నూర్ పట్టణంలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: మంచిర్యాలలోని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి ఇంటిపై ఐటీ దాడులను నిరసిస్తూ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోగుల సతీశ్, కాంగ్రెస్ నాయకులు గొడిసెల బాపురెడ్డి, చెన్నూరి శ్రీధర్, సుశీల్, పిట్టల రవి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో ర్యాలీ

మందమర్రిరూరల్: మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఆధ్వర్యంలో మందమర్రిలో నల్ల కండువాలు వేసుకుని నిరసన తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ శ్రేణులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

'ఐటీ దాడులతో బీఆర్ఎస్‌కు సంబంధం లేదు'

చెన్నూర్: చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామిపై జరుగుతున్న ఐటీ దాడులతో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని నాయకులు రేవెల్లి మహేశ్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకకాలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఇళ్లపై ఐటీ దాడులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని సతీశ్, తాటికొండ సురేశ్, గడిపల్లి సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ సాగుతోనే భూసారం



పత్తిపంటను పరిశీలిస్తున్న విదేశీయులు

జైనూర్: ఆర్గానిక్ సాగుతోనే భూసారం పెరుగుతుందని సంస్థ సీఈవో నందకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దబోలి, రాసిమెట్ట గ్రామాల్లో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి క్షేత్రాలను విదేశీయులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల నుంచి ఆర్గానిక్ వైపు రైతులను మళ్లించడమే లక్ష్యంగా చేతనా ఆర్గానిక్ సంస్థ పనిచేస్తోందన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో పత్తి సాగు చేసే రైతులకు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మార్కెటింగ్ అవకాశం కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దాసండ్ల ప్రభాకర్, ముజీబ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో రజకుల స్థానం స్పష్టం చేయాలి'

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణలో రజకుల స్థానంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించడంపై కేంద్రం స్పందించి ఏబీసీడీ వర్గీకరణలో రజకుల స్థానం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన తంగళ్లపల్లి తిరుపతిని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. సమావేశంలో రజక రిజర్వేషన్ సమితి యూత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సంగెపు ఎల్లన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు కంచెర్ల కొమురయ్య, అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు కొలిపాక రమేశ్, నాయకులు తాడూరి శంకర్, రాసమల్ల కుమార్, పాయిరాల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు చుక్క బందే!

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో మూడు రోజులు వైన్స్, బార్‌షాపులు మూసివేయాలని భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మందు బాబుల్లో కలవరం రేపింది. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూడు రోజుల పాటు మద్యం షాపులు, బార్లు మూసి వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. భారత ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28న మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 30న గురువారం సాయంత్రం 4గంటల వరకు వైన్స్ షాపులు బంద్ ఉంచాలని ఆయన కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జిల్లాలో నిరుద్యోగ చైతన్య బస్సుయాత్ర



మాట్లాడుతున్న యాత్ర సభ్యులు

మంచిర్యాలటౌన్/చెన్నూర్/బెల్లంపల్లి: నిరుద్యోగ చైతన్య బస్సుయాత్ర మంగళవారం జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లిలో నిర్వహించారు. మంచిర్యాలలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యాత్ర కన్వీనర్ డాక్టర్ రియాజ్ బృందం సభ్యులు నిరుద్యోగులతో మాట్లాడారు. గ్రంథాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినదించారు. యాత్ర ఉమ్మడి కరీంనగర్ ఇన్‌చార్జి సురేశ్ చెన్నూర్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వాన్ని గద్దెదింపుదామని అన్నారు. యాత్ర కన్వీనర్ రియాజ్‌ఖాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. బెల్లంపల్లిలో కాంటా చౌరస్తా వద్ద నిరుద్యోగ యువకులను కలిశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతదేహం పరిశీలిస్తున్న ఎస్సై

పెంబి: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నాయికపుగుడాలో చోటు చేసుకుంది. ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... కస్తూరి చిన్నరాజన్న(42) తన కున్న ఎకరం భూమితో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, అలాగే గత సంవత్సరం కూతురి పెళ్లికి రూ.3లక్షలు అప్పు కావటంతో జీవితంపై విరక్తితో పొలంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అరలీటరు బస్తాతో సమానం

- లిక్విడ్ రూపంలో నానో యూరియా, డీఏపీ
- రైతులకు తగ్గనున్న ఖర్చులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో (ఫైల్)

చెన్నూర్‌రూరల్: పంటల సాగులో ఎరువుల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది.ఎరువుల ధరలకు రైతులు కుదేలవుతున్నారు. వరి, పత్తి పంటలలో యూరియా, డీఏపీ ఎరువు ఎంతో ముఖ్యమైనది. అత్యవసర సమయంలో మార్కెట్‌లో డీఏపీని అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కానీ ఇక రైతులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఇఫ్‌కో(ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్) నానో రూపంలో యూరియా, డీఏపీని లిక్విడ్ రూపంలో రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ ద్రావణాలు లీటరు, అర లీటరు పరిమాణంలో లభిస్తున్నాయి. ఎకరాకు బస్తా యూరియా, రెండు బస్తాల డీఏపీ బదులుగా నానో యూరియా, డీఏపీ వినియోగిస్తే ఎకరాకు సగటున రూ.5వేలు తగ్గే అవకాశం ఉంది. పత్తి, మొక్కజొన్న, మిర్చి ఇతర పండ్ల తోటల్లో నేరుగా మొక్కలపై పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఇప్పటి వరకు బ బస్తాల్లో ఉండే యూరియా, డీఏపీ గుళికలను వరి నాటు వేసే ముందు పొలంలో చల్లేవారు. ఒక్కో సారి నాట్లు వేసే సమయంలో కూలీలు తొక్కుతుండటంతో పొలమంతా విస్తరించకుండా ఎరువంతా ఒక్కచోటే చేరేది. నానో యూరియా, డీఏపీతో ఈ సమస్య ఉండదు. మరోవైపు ఎక్కువ పోషకాలు సమకూర్చుతున్నందువల్ల పంట దిగుబడులు సైతం పెరిగి రైతుకు అదనంగా ఆదాయం సమకూరనుంది. యూరియా, డీఏపీ లిక్విడ్ రూపంలో రావడంతో యూరియా, డీఏపీ బస్తాలను రైతులు పంట పొలాల వరకు వివిధ దశల్లో తరలించే రవాణా ఖర్చులు తగ్గుతాయి. ఇలా రైతులకు రవాణ ఖర్చులు, ప్రభుత్వానికి గోదాముల అద్దెలు తగ్గిపోతాయి. ఎకరాకు అరలీటరు నానో యూరియా, అరలీటరు డీఏపీ సరిపోతుంది. స్ప్రేయర్లతో పిచికారీ చేస్తే పొలం మొత్తం విస్తరించే అవకాశం ఉంది.

స్ప్రేచేస్తే సరిపోతుంది



నానో డీఏపీని పంట పొలంలో స్ప్రేచేస్తే సరిపోతుంది. ఇప్పటికే నానో యూరియా మార్కెట్‌లోకి వచ్చింది. కొంతమంది రైతులు తమ పంటపొలాల్లో వినియోగిస్తున్నారు. నానో యూరియా, డీఏపీలతో రైతులు పంటల పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చు.

– కవిత, ఏవో, చెన్నూర్